ప్రజలు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి

- ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి
- రాంగ్‌రూట్, అతివేగంతో ప్రాణాలు కోల్పోవద్దు
- పదేపదే పట్టుబడితే కఠిన చర్యలు
- మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య





మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కౌన్సిలింగ్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాదాపూర్: వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ జి.నర్సయ్య సూచించారు. రాంగ్‌రూట్, అతివేగంతో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. అవగాహన కార్యక్రమాల వల్ల కొంతమేర మార్పు ఉంటుంది. ఎవరికి వారే నిబంధనలు పాటిస్తే సమస్య రాదు. అవసరమైనప్పుడే కార్లను వాడాలి. ఆఫీసులకు వెళ్ళేవారు ఒక గంట ముందు బయలుదేరాలని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ జి.నర్సయ్య అంటున్నారు.

ప్రశ్న. మాదాపూర్‌లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలు ?

జ: సోమవారం నుంచి శుక్రవారం వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. వ్యక్తిగత వాహనాలు బాగా పెరుగుతున్నాయి. వీఐపీ జోన్ కావడం .. ఐకియా నుంచి జేఎన్‌టీయు వరకు సర్వీస్ రోడ్డు లేకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. హైటెక్స్, మైండ్‌స్పేస్, దుర్గం చెరువు, ఇనార్బిట్‌మాల్, టెక్ మహేంద్ర, సైబర్‌టవర్స్ వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. నో పార్కింగ్, రాంగ్‌రూట్, హెల్మెట్ లేకపోవడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ కేసులు ఎక్కువగా ఉన్నాయి.

ప్ర : మాదాపూర్ వీఐపీ జోన్ కావడంతో నెలకొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటి?

జ: మాదాపూర్‌లోని హైటెక్స్, శిల్పకళా వేదిక, శిల్పారామం, హెచ్ఐసీసీలో ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పెద్ద సంఖ్యలో సదస్సులు జరుగుతాయి. జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు వీవీఐపీలు ఎక్కువగా వస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. సదస్సుల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కష్టంగా ఉంటుంది.

ప్ర : డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి ఇచ్చే కౌన్సిలింగ్ వల్ల మారుతున్నారా..

జ: స్వతహాగా ఎవరికి వారే మారాలి తప్ప అవగాహన కార్యక్రమాల వల్ల పెద్ద మార్పురాదు. డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన వారిని మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కౌన్సిలింగ్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాలు, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు పడుతున్న ఇబ్బందులపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కొందరు మాత్రం పదేపదే పట్టుబడుతున్నారు.

ప్ర: వాహనదారులకు, పాదచారులకు మీరు ఇచ్చే సూచనలు ?

జ: ట్రాఫిక్ రూల్స్‌ను ఖచ్చితంగా పాటించాలి. వాహనదారులు కార్యాలయాలకు వెళ్ళేవారు ముందుగానే బయలుదేరాలి. హడావిడిగా బయలుదేరి రాంగ్‌రూట్‌లో ప్రయాణించవద్దు. మిగతా వాహనదారులకు సమస్యగా మారుతుంది. ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతారు. పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడవాలి. సిగ్నల్స్ ప్రకారమే రోడ్డు దాటాలి. ఇక వాహనాలకు నంబర్‌ప్లేట్‌లు తప్పనిసరిగా ఉండాలి. ఫ్యాషనబుల్‌గా ఉండకూడదు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని 'న్యూ బిగెనింగ్' పేరిట ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మెడిటేషన్, స్ఫూర్తిదాయక చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నూతన సంవత్సర సంబరాలు చేసుకుంటారు. వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కౌన్సిలర్ మయూరిరాజు గౌడ్ అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, ఏఈ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, ట్యాలీ, డీటీపీ శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. మహిళలు మొదట అడిష్మన్ కొరకు రూ.150లు చెల్లించాలి. మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాలవారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు కన్వీనర్ వనశ్రీ ఫోన్ : 9246530048కు సంప్రదించగలరు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్

సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఉంది. మహిళల, కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ కూడా తీసుకోవచ్చు.

కెనరీ ద స్కూల్ వార్షికోత్సవం

మాదాపూర్: చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో బుధవారం రాత్రి కెనరీ ది స్కూల్ 8వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆదిలక్ష్మి చింతలపాటి హాజరై ప్రసంగించారు. చిన్నారులకు సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థులు సహజవనరుల పరిరక్షణపై నాటకం వేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్ రెడ్డి, చైర్‌పర్సన్ శ్వేతారెడ్డి చప్పిడి, ప్రిన్సిపల్ లిడియా క్రిస్టీనా, అడ్మిన్ మేనేజర్ మహేశ్ అక్కం, పాల్గొన్నారు.

గీతంలో అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'పర్యావరణ, సమాజం, పరిపాలనలో (ఈఎస్‌జీ) సమకాలీన సమస్యలు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును 2024 ఫిబ్రవరి 16,17 తేదీలలో నిర్వహించనున్నట్టు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈఎస్‌జీ ప్రాముఖ్యత, పర్యావరణం, సమాజం, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం గురించి అవగాహన పెంచడం ఈ సదస్సు లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు, నిబంధనలు, కార్పొరేట్ పద్ధతులు, పెట్టుబడి వ్యూహాలు, వాటాదారులకు అనుగుణంగా ఈఎస్‌జీ కి సంబంధించిన అనేక విస్తృత అంశాలను ఈ సదస్సులో చర్చిస్తారని చెప్పారు. ఈ సదస్సులో పాల్గొనేవారు విస్తృత చర్చలలో పాల్గొనడంతో పాటు పరిశోధనా పత్రాలను కూడా సమర్పించవచ్చని, పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసిన పరిశోధక పత్రాలను 2024 జనవరి 20వ తేదీలోగా సమర్పించాలని స్పష్టీకరించారు. ఈ సదస్సులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు 2024 జనవరి 31లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం డాక్టర్ జీ.ఆర్.కే.ప్రసాద్‌ను 95429 78515లో సంప్రదించాలని సూచించారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

హఫీజ్‌పేట్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆరంభ టౌన్‌షిప్, హఫీజ్‌పేట్ కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం మహిళలకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై మాట్లాడుతూ ఆరోగ్యం, పారిశుద్ధ్యం, విజ్ఞానాన్ని మేళవించే సనాతన సాంప్రదాయమే ముగ్గులు వేయడమన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అపార్ట్‌మెంట్ కల్చర్ బాగా పెరిగిన తరువాత మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు భవిష్యత్తు తరానికి అందించడానికి, మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తాటిచర్ల వరలక్ష్మి, అసోసియేషన్ సభ్యులు, ఆషా, విజయలక్ష్మి, దుర్గ, నాగలక్ష్మి, సంతోషి, సుశీల పాల్గొన్నారు.

ఎస్‌పీఐఈ ఫెలోగా ప్రొ.సోమవేణుగోపాలరావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సోమ వేణుగోపాలరావు సొసైటీ ఆఫ్ ఫొటోగ్రాఫిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్స్ (ఎస్‌పీఐఈ) ఫెలోగా ఎన్నికయ్యారు.ఈయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్. ఎస్‌పీఐఈ అనేది ఆప్టిక్స్, ఫొటోనిక్స్ టెక్నాలజీ అంతర్జాతీయ ప్రొఫెషనల్ సొసైటీగా గుర్తింపు పొందింది. 184 దేశాల నుంచి రెండున్నర లక్షలకుపైగా నిపుణులతో కూడిన గ్లోబల్ సంస్థగా పనిచేస్తోంది. కాగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

మద్యానికి బానిసైన వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసైన వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఏఎస్ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు పట్టణంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన జోగు శీను(46) టెంట్ హౌస్‌లో పనిచేసేవాడు., గత కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి జోగు శీను పడుకున్న చోట నుండి లేవకపోవడంతో అతని సోదరుడు యాదయ్య చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.మృతుడి సోదరుడు యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో..

అనారోగ్యంతో వాంతులు చేసుకున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది ఏఎస్ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సాజిత్ బిశ్వాస్(40) బతుకుదెరువు కోసం నెల క్రితం ఇస్నాపూర్ వచ్చి సోదరుడి వద్ద ఉంటూ పాశమైలారం పారిశ్రామికవాడలో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రెండవ తేదీ డ్యూటీకి వెళ్లి వచ్చిన తర్వాత రాత్రి 10 గంటలకు ఇంట్లో వాంతులు చేసుకున్నాడు. తిరిగి మరుసటి రోజు మూడో తేదీ వాంతులు కావడంతో సోదరుడు చికిత్స కోసం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుండి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి సోదరుడు అబిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక..

భాగ్యనగర్‌కాలనీ: అప్పులు, కుటుంబ సమస్యలు తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన ఏడుపుగంటి చిన్న సాంబశివరావు (55)ప్రైవేట్ ఉద్యోగి. భార్యతో కేపీహెచ్‌బీ కాలనీ హెచ్ఐజీ 20లో నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తె కలకత్తాలో నివసిస్తుండటంతో కొద్దిరోజుల క్రితం సాంబశివరావు తన భార్యతో కలిసి కలకత్తాకు వెళ్లాడు. తిరిగి ఒక్కడే అక్కడి నుంచి పది రోజుల క్రితం కేపీహెచ్‌బీ కాలనీకి వచ్చాడు. ఈ క్రమంలో సాంబశివరావుఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ కలహాలతో పాటు అప్పుల బాధ తట్టుకోలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోటు రాసి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.



కొండాపూర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకుడు జగదీశ్వర్‌గౌడ్

ప్రజాపాలన కేంద్రాల పరిశీలన

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌లోని కొత్తగూడ కమ్యూనిటీహాల్, అంజయ్యనగర్ వార్డు కార్యాలయం, మాదాపూర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంను కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకంను ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా కార్యకర్తలు చూడాలన్నారు. ఈనెల 6వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు జంగంగౌడ్, నీలం లక్ష్మీనారాయణ ముదిరాజ్, కృష్ణగౌడ్, హనుమంతు, ఇమ్రోజ్, లక్ష్మీ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

జంట సర్కిళ్లలో 10,807 దరఖాస్తులు

శేరిలింగంపల్లి/హఫీజ్‌పేట్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో మొత్తం 10,807 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఆరు గ్యారంటీల కోసం 7,359 దరఖాస్తులు, ఇతర దరఖాస్తులు 3,448 వచ్చాయి. ఇదిలావుండగా చందానగర్ సర్కిల్ పరిధిలో మొత్తం దరఖాస్తులు 5,607 దరఖాస్తులు వచ్చాయి, అందులో ఆరు గ్యారంటీల కోసం 3,859 దరఖాస్తులు, ఇతర అంశాలపై 1,748 దరఖాస్తులు వచ్చాయి. అదేవిధంగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో మొత్తం 5,200 దరఖాస్తులు రాగా అందులో 3,500 దరఖాస్తులు ఆరు గ్యారంటీల కోసం కాగా 1,700 దరఖాస్తులు ఇతర అంశాలపై వచ్చాయని అధికారులు తెలిపారు. జంట సర్కిళ్ల పరిధిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలను జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలించారు.

కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ఎస్ఐ సత్యం తదితరులు

ఆల్విన్‌కాలనీ: సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆస్‌బెస్టాస్ కాలనీవాసులు ముందుకు రావటం అభినందనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీలో 15 లక్షల రూపాయల వ్యయంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 104 సీసీ కెమెరాలను ఎస్ఐ సత్యం, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలతో నేర శోధన, నివారణకు తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కాలనీ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, అబ్దుల్ ఖయ్యూమ్, కృష్ణ, రఫీక్, హరిప్రసాద్, భగత్‌సింగ్, సదాశివుడు, పోశెట్టిగౌడ్ పాల్గొన్నారు.

బాల కార్మికునికి విముక్తి



బాల కార్మికుడితో ఆపరేషన్ స్మైల్ టీం సభ్యులు

గచ్చిబౌలి: వెల్డింగ్ షాపులో పని చేస్తున్న బాల కార్మికునికి ఆపరేషన్ స్మైల్ టీం విముక్తి కల్పించింది. గోపన్‌పల్లిలోని హెచ్‌కెజీఎన్ వెల్డింగ్ షాపులో గత నెల రోజులుగా ఒరిస్సాకు చెందిన బాల కార్మికుడు హమీద్ అలీ(14) పని చేస్తున్నాడు. సమాచారం అందడంతో గురువారం ఎన్‌టీఆర్‌నగర్‌లోని వెల్డింగ్ షాపునకు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ సరస్వతి ఆధ్వర్యంలో వెళ్లి హమీద్ అలీ(14)ని తీసుకొని హోమ్‌కు తరలించారు. షాపు యజమాని మహ్మద్ అష్మద్‌పై గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ విఠల్, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ కుమార్, కానిస్టేబుళ్లు సంతోష్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చౌరస్తాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేయండి

ట్రాఫిక్ సిబ్బందిని నియమించండి: స్థానికులు



ఉషాముళ్లపూడి హాస్పిటల్ చౌరస్తా వద్ద నిలిచిపోయిన వాహనాలు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ సిగ్నల్స్, సిబ్బంది అందుబాటులో లేక ప్రతినిత్యం ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాజులరామారం, విలేజ్ చౌరస్తా, ఉషాముళ్లపూడి హాస్పిటల్ చౌరస్తాల మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అటు బాచుపల్లి, మరో వైపు కూకట్‌పల్లి వైపు నుంచి ఈ మార్గం గాజులరామారం, షాపూర్‌నగర్‌లకు షార్ట్ కట్ కావడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుండటంతో కార్యాలయాలకు, స్కూళ్లకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ట్రాఫిక్ లో ఇరుక్కుని బయట పడటానికి అర్ధగంట పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. బుధవారం ఉషాముళ్లపూడి చౌరస్తా నుంచి సీఎంఆర్ స్కూల్ వరకు కార్లు, స్కూల్ బస్సులు గంటల పాటు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్, సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మాస్టర్ ప్లాన్ వింగ్ బాక్స్ పోల్స్ ఏర్పాటు చేస్తుండటంతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3.30 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డాగ్ పార్క్ ఏరియా, రాడిసన్ హోటల్, లీ మెరీడియన్, గచ్చిబౌలి స్ట్రీట్ నెంబర్ 1,2,3, హిమగిరి హాస్పిటల్, సెంట్రల్‌మాల్, క్వయట్ లాండ్, గచ్చిబౌలి ఫ్లైఓవర్ ఏరియా తదితర ప్రాంతాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముగ్గురికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం 12 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందులో ముగ్గురికి పాజిటివ్ నిర్ధారణ అయిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.అదేవిధంగా 09 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

ఇనార్బిట్లో.. నేటి నుంచి 'బ్రాండ్' షో

సాక్షి సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో దేశంలోనే పేరొందిన ఫ్యాషన్ బ్రాండ్స్ ఉత్పత్తుల ప్రదర్శన శుక్రవారం నుంచి 3 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని మాల్ ప్రతినిధులు తెలిపారు. జాక్ అండ్ జోన్స్, శంతను నిఖిల్, లెవిస్...తదితర 100కుపైగా విభిన్న రకాల బ్రాండెడ్ ఉత్పత్తులు ఈ ప్రదర్శనలో కొలువుదీరుతున్నాయని, వీటిని అనూహ్యమైన ఆఫర్లతో అందిస్తున్నామని వివరించారు.

ఆలయాభివృద్ధికి లక్ష విరాళం

నిజాంపేట్: ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 29వ డివిజన్ మధురానగర్ కాలనీలోని అష్టలక్ష్మి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం డిప్యూటీ మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధికి తన వంతు సహాయంగా రూ.1 లక్ష విరాళంగా కమిటీ సభ్యులు లింగయ్య, విష్ణు, రాంబాబులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాఘవేంద్రరావు, ఆవుల జగన్‌యాదవ్, కుమార్‌రెడ్డి, దశరథ్, ఆనంద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రత్యేక పూజలు



రాయదుర్గం: గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతి, కాశీ విశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలుచేసి ప్రత్యేక అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బస్తీ దర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీలలో నెలకొన్న డ్రైనేజ్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని వాసవీనగర్ కాలనీలో బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే గాంధీకి అభినందనలు తెలిపిన అసోసియేషన్ సభ్యులు



గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ కమిటీ ప్రతినిధులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆయన నివాసంలో బీఆర్ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు, నల్లగండ్ల మార్కెట్ కమిటీ అధ్యక్షులు డి.వీరేశంగౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు ఖాజాపాషలు నూతన సంవత్సర శుభాకంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రతినిధులు అజీమ్, అస్లాం, రాజు, లాల, మొహీస్, చిన్నా, రవి, షరీఫ్, దాదు తదితరులు పాల్గొన్నారు.

యోగా సభ్యుల అభినందనలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌కాలనీలోని వినాయక పార్కు యోగా గ్రూప్ సభ్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వినాయక పార్కు యోగా గ్రూప్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, రేణుక, విజయలక్ష్మి, రాణి, మాధవి, రాధారాణి, హేమ తదితరులు పాల్గొన్నారు.

నిరంజన్ జట్టుకు ట్రోఫీ అందజేత



విజేత జట్టుకు ట్రోఫీని అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడలకు పెద్దపీట వేయడంతో పాటు క్రీడాకారుల కోసం వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఎమ్మెల్యే సౌజన్యంతో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి గురువారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన నిరంజన్ జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, శ్రీధర్‌చారి, హనుమంత్‌రెడ్డి, పృథ్వీరాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



హఫీజ్‌పేట్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సరితారెడ్డి తెలిపిన ప్రకారం.. లింగంపల్లి తారానగర్ తుల్జాభవాని టెంపుల్ వీధిలో శ్రీనివాస్‌చారి కుటుంబం నివాసముంటోంది. అతనికి ఇద్దరు కుమారులు కృష్ణచారి, శరత్ చారిలు ఉన్నారు. శరత్ (26) కు 4 నెలల క్రితం నగరంలోని సనత్‌నగర్‌కు చెందిన బోదినగుండ్ల చందనతో వివాహం జరిగింది. అయితే శరత్‌చారి వివాహ ఖర్చులు అతని అన్న కృష్ణ చారి పెట్టాడని తెలిపారు. 4నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదని అతని అన్న కృష్ణ, వదిన ప్రమీలలు శరత్‌కు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని తిట్టారన్నారు. దీంతో గత కొన్ని రోజుల క్రితం వారి పెళ్ళికి వచ్చిన బంగారు నగలను తాకట్టు పెట్టి డబ్బులు చెల్లించారు. అంతటితో ఆగకుండా ఇంకా డబ్బులు కావాలంటూ బెదిరిస్తున్నారన్నారు. దీంతో శరత్ తీవ్ర మనస్థాపం చెంది భార్య చందనను కొన్ని రోజులు పుట్టింటికి వెళ్లమన్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఎవరు లేని సమయంలో ఇంట్లో మద్యంలో పురుగుల మందు కలిపి తాగాడు. అతని భార్య ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోడంతో కుటుంబ సభ్యులకు తెలుపగా అతని రూమ్‌కు వెళ్ళి చూడగా కిందపడి పోయి కనిపించాడు. అప్పటికే మృతి చెందాడని గమనించి భార్యకు విషయం తెలుపగా వెంటనే చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భాగ్యనగర్‌కాలనీ: దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ అంతెరగాన్‌కు చెందిన భూతాలి బాలరాజు (41) సీబీసీఐడీ కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ షాప్‌కి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి వస్తుండగా హైదర్‌నగర్ పోచమ్మ ఆలయం సమీపంలో మియాపూర్ వైపు నుంచి వచ్చిన బైక్ రైడర్ రోడ్డు దాటుతున్న బాలరాజును ఢీకొట్టాడు. దీంతో బాలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలరాజు భార్య మాధవి చికిత్స కోసం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.